www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -178 సోమవారం 09 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -5 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545



# జర్నలిస్టుల బాధ్యత మాది

☛ సిఎం రేవంత్ రెడ్డి

- ☛జర్నలిస్టుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం
- ☛విధివిధానాలు రూపొందించండి
- ☛వాటికి చట్టబద్ధత కల్పించే బాధ్యత తీసుకుంటాం
- ☛అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు
- ☛ప్రెస్ అకాడమీకి స్పెషల్ ఫండ్ కింద రూ. 10 కోట్లు
- ☛ఫ్యూచర్ సిటీలో మిగతా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

2లో.

# పేరుకే ప్రజాప్రభుత్వం

## హైడ్రా కూల్చివేతలపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్:(ప్రజా వినికిడి):
హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమంలో (ఆదివారం) కొందరు పేద, మధ్య తరగతి కుటుంబాలు ఉంటున్న ఇళ్లను కూల్చేసింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారన్నారు. జోరువానలో కనికరంలేని ప్రభుత్వం.. కర్కశంగా కూల్చివేస్తే అభాగ్యులు ప్లాస్టిక్ కవర్ల నీడలో తలతదాచుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల కోసం 4వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని%ా% అవన్నీ పేదలకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వెంటనే ఈ ఇళ్లలోకి వారిన తరలించాలని రాష్ట్ర సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

## హైకోర్టు తీర్పుపై ఆ ఎమ్మెలలో ఉత్కంఠ




హైదరాబాద్:
పార్టీ మారిన ఎంఎల్ఎలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం తీర్పు వెలువడనుంది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంఎల్ఎలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులకు కోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. 2023 సంవత్సరం చివరలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. కాగా ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు వివిధ కారణాలతో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**మూడు చెరువుల్లో ఆక్రమణలు నేలమట్టం**

**ఉద్రిక్తతల మధ్య మాదాపూర్, అమీన్‌పూర్, దుండిగల్ పరిధిలో భారీ భవంతులు, డూప్లెక్స్ విల్లాలు, అక్రమ లే అవుట్లు కూల్చివేత**

**జయభేరి కన్‌స్ట్రక్షన్‌కు నోటీసులు**

**గచ్చిబౌలిలోనూ ఆక్రమణదారులకు తాఖీదులు**



# హైడ్రా దూకుడు

అమీన్ పూర్:హైదరాబాద్:(ప్రజా వినికిడి):
హైడ్రా మరింత దూకుడు పెంచింది. ఆదివారం మూడు ప్రాంతాల్లో భారీబందోబ స్తు మధ్య కూల్చివేతలను జరిపింది. హైదరాబాద్ నగర శివార్లలోని అమీన్‌పూర్ పెద్ద చెరువు, దుండిగల్ మల్లంపేట్ లోని కత్వా, మాదాపూర్ సున్నం చెరువు వద్ద ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఈ సందర్భంగా మాదాపూర్ సున్నం చెరువు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. కూల్చివేతలను అడ్డుకునే క్ర మంలో ఐదుగురు వ్యక్తులు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యా యత్నం చేశారు. పోలీసులు అ డ్డుకుని, అక్కడి నుంచి వారిని తరలించి ఆక్రమణలను కూల్చివేశారు. దీంతో కూల్చివేతలు నిరంతరాయంగా సాగాయి. అయితే, సున్నం చెరువు ప్రాంతంలో ఒడిశాకు చెందిన కూలీలు వేసుకున్న గుడిసెలను కూడా తొలగించారు. గుడిసె వాసులు కొందరు ఆగ్రహానికిలోనై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యా యత్నం చేశారు. ఆదివారం ఉ. 5.30 గం.ల ప్రాంతంలోనే కూల్చివేతల ప్రాంతాలకు చెరుకున్న దాదాపు 30 టీంలు, అత్యాధునిక హైడ్రాలిక్ క్రేన్‌లతో భారీ పోలీసు బందోభస్తు మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు చేపట్టారు.

**మిగతాది 2లో...**

# మళ్లీ పొంగిన మున్నేరువాగు

## ఖమ్మంకు మరోసారి ముంపు భయం

**రెండురోజులుగా పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలతో ఉప్పొంగిన మున్నేరు**

**తిరిగి పునరావాస కేంద్రాలకు బాధితులు**

**వరద ప్రభావిత ప్రాంతాల్లో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పొంగులేటి పర్యటన**



ఖమ్మం (ప్రజా వినికిడి):
ఖమ్మం నగర ప్రజలకు మళ్ళీ వరద ముప్పు ఏర్పడింది. ఈనెల 1న వచ్చిన భారీ వరద గాయాల నుంచి ఇంకా తేరుకోకముందే మళ్లీ వరద పంజా విసిరింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వరకు మున్నేరు పరివాహక ప్రాంతమైన ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం నగరంలో మున్నేరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో వరద బాధితులంతా మళ్లీ పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళారు. గంట గంటకు పెరుగుతున్న వరదతో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువైంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలను ఇళ్ళ నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు వరద తాకడికి గురికావడంతో బాధితులంతా భయాందోళన చెందుతున్నారు**మిగతాది 2లో...**



## పారా ఒలింపిక్స్ విజేత దీప్తి జివాంజీకి కోటి నజరానా, గ్రూప్-2 ఉద్యోగం

హైదరాబాద్:(ప్రజా వినికిడి):
పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ క్రీడాకారిణి దీప్తి జివాంజీ ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. అథ్లెట్ దీప్తిని మరింత ప్రోత్సహించేందుకు గ్రూప్-2 ఉద్యోగంతోపాటు రూ.కోటి నగదు బహుమతిని అందజేస్తామని రేవంత్ ప్రకటించారు. దీంతోపాటు వరంగల్ లో 500 గజాల స్థలం ఇవ్వాలని నిర్ణయించారు. ఇక దీప్తి జివాంజీ కోచ్ రమేష్ కు రూ.10 లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పారాలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహం కోసం ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నివాసిత భవనాల జోలికి వెళ్లం: రంగనాథ్



హైదరాబాద్:(ప్రజా వినికిడి):
చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో నిర్మించి నివాసముంటున్న భవనాల జోలికి వెళ్లమని, కేవలం నిర్మాణ దశలో ఉన్న భవనాలను మాత్రమే కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంచేవారు. ఆదివారం చోటుచేసుకున్న కూల్చివేతలపై వస్తున్న విమర్శలకు ఆయన స్పందించారు. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు సం బంధించి కొన్ని వివరణలను కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో నిర్మించబడి, వ్యక్తులు ఆక్రమించిన ఇల్లు లేదా కు టుంబం నివాసమున్న కట్టడాలను ఏదీ కూల్చివేయబడదని తెలిపారు. ఎఫ్‌టిఎల్ లేదా బఫర్‌లోకి వచ్చే కొత్త నిర్మాణాలను కూల్చివేయబడతాయని తెలిపారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోనలలో ఫ్లా ట్లు, ఖాళీ స్థలాలుగానీ, భవనాలు గానీ, భూములుగానీ కొనుగోలు చేయరాదని కమిషనర్ సూ చించారు.

**మిగతాది 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జర్నలిస్టుల బాధ్యతమాది



హైదరాబాద్:(ప్రజా వినికిడి):
జర్నలిస్టుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం విధివిధానాలు రూపొందించాలని, వాటికి చట్టబద్ధత కల్పించే బాధ్యత తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తామని, ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు, ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని పునరుద్ఘాటించారు.
జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులకు భూకేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. పేట్ బషీర్‌బాద్‌లో ప్రభుత్వం కేటాయించిన 38 ఎకరాల స్థలాల పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి అందించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన వ్యక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అలా వ్యవహరించినప్పుడే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. తమ ప్రభుత్వం అనేక సమస్యలకు పరిష్కారం చూపిందని, వృత్తిపరమైన గౌరవం మనకు మనమే పెంచుకోవాలని సూచించారు. గతంలో అసెంబ్లీ జరిగినప్పుడు జర్నలిస్టులను లోపలికి అనుమతించలేదని, తమ ప్రభుత్వం వచ్చాక స్పీకర్‌కు తానే అసెంబ్లీ లోపలికి జర్నలిస్టులను అనుమతించాలని కోరానని వెల్లడించారు.
ఏ వర్గంలో అయినా కొందరు చేసే పని వల్లనే ఇబ్బంది కలుగుతోందని, గతంలో సచివాలయానికి వెళ్లేందుకు తమకే అనుమతి లేదని, కొంత మందికి పాస్‌లు ఇచ్చి లోపలికి రప్పించి ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. అలాంటి వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపైనే ఉందన్నారు. వ్యవస్థల మీద నమ్మకం పెంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలో 73 మంది నిజాన్ని చూడక ముందే కన్ను మూశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్ అకాడమీకి స్పెషల్ ఫండ్ కింద రూ. 10 కోట్లు కేటాయిస్తున్నామని, ఆ నిధులతో జర్నలిస్టులకు సదస్సులు, శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

### నాకూ ఇంటిపట్టా ఇంకా రాలేదు:

ఎమ్మెల్యేగా రూ.10 లక్షలు కట్టిన తనకు కూడా ఇంకా ఇంటిపట్టా రాలేదని, తన ఇంట్లో కూడా ఇంకా అడుగుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి సభలో అనగానే నవ్వులు వెల్లివిరిశాయి. రాజకీయ నాయకులు, పాత్రికేయ మిత్రులు ఒకరినొకరు గౌరవించుకుంటూ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని సూచించారు. ఢిల్లీలో విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులకు సెంట్రల్ హాల్‌లోకి వెళ్లేందుకు కూడా పర్మినెంట్ పాస్‌లు వారి సీనియారిటీని బట్టి ఇచ్చారని, అలాగే తెలంగాణలో కూడా సీనియారిటీ ప్రాతిపదికన సచివాలయం, అసెంబ్లీ, ప్రభుత్వ కార్యాలయాల్లోకి ప్రవేశించేలా ఎవరికి పాస్‌లు ఇవ్వాలన్నది మీడియా అకాడమీ, సభ్యులు నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు.

### యూట్యూబ్ ఛానెల్ పెట్టి ప్రతి ఒకరు జర్నలిస్ట్ అంటున్నారు:

అసలు జర్నలిస్టుల కంటే కొసరు జర్నలిస్టులు ఎక్కువయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నిజమైన జర్నలిస్టులను అగౌరవపరిచే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదన్నారు. ప్రస్తుతం ఎవరు పడితే వారు యూట్యూబ్ ఛానల్ పెట్టుకుని జర్నలిస్టులంటున్నారన్నారని, కొంతమంది చిట్ చాట్లను కూడా బదనాం చేస్తున్నారన్నారు. జర్నలిస్టులు సమాజానికి సేవ చేసే డాక్టర్లు అని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చిక్కుముళ్లను పరిష్కరించిందని గుర్తు చేశారు. జర్నలిస్టులు పార్టీ కార్యకర్తలగా వ్యవహరించవద్దని కోరారు. కొన్ని రాజకీయ పార్టీలే పత్రికలు నడుపుతున్నాయని, సిద్ధాంతాలను ప్రచారం చేసుకునే పత్రికలు ఎక్కువయ్యాయన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో ఏ వ్యవస్థకు పాలసీ లేదన్నారు. చిన్న, పెద్ద పత్రికలను ఎలా గుర్తించాలో ఒక నివేదికను తయారు చేయాలన్నారు.

### ఫ్యూచర్ సిటీలో మిగతా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు:

ప్రస్తుతం ఇంటి స్థలాలు రాని పాత్రికేయ మిత్రులు బాధపడాల్సిన అవసరం లేదని, ఫ్యూచర్ సిటీలో వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాడిన జర్నలిస్టుల కల నెరవేరిందని, ఇల్లు అనేది ఎవరికైనా పెద్ద కల అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు పూర్తిగా స్వేచ్ఛ ఇస్తున్నామన్నారు. 1100 మంది జర్నలిస్టులకు ఈ రోజు పండగ రోజని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కారం చేశామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో కమిటీ వేయాలని సూచించారు.

### పింక్ కలర్ పేపర్లు వరదల పైనా రాజకీయం : మంత్రి పొంగులేటి

మాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మూసీ ప్రక్షాళన, ఫోర్త్ సిటీ, రైతులకు రూ.31 వేలకోట్ల రుణమాఫీ వంటి మంచి కార్యక్రమాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తుంటే శవాల మీద చిల్లర ఏరుకునేలా వరదల్లోనూ బురద రాజకీయాలు చేశారని ధ్వజమెత్తారు. రెండు సార్లు కర్రు కాల్చి వాత పెట్టినా వారికి ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. మీడియా మిత్రులపై ఉక్కుపాదం మోపారని, పత్రికా సమావేశాల్లో వారిని టార్గెట్ చేసి మానసిక క్షోభకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు కావాలి..ఇందిరమ్మ రాజ్యం రావాలి అని ఆశించామని, వారి చిరకాల వాంఛ అయిన ఇంటి స్థలాలను అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే చేసి చూపించామని అన్నారు. ప్రస్తుతం ఈ సొసైటీలోని జర్నలిస్టు మిత్రులు లక్షాధికారులు కాదని, కోటీశ్వరులని మంత్రి సభలో చమత్కరించారు.

### జిల్లా, మండల స్థాయిలోనూ ఇళ్లస్థలాలు ఇవ్వాలి :మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణలోని జిల్లా, మండల కేంద్రాల్లోని అర్హులైన జర్నలిస్టు మిత్రులకు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో అందరూ బాగుండాలని కోరుకుంటుందని, నమ్మకంగా రాజ్యాంగాన్ని అమలు చేసే పార్టీ అని స్పష్టం చేశారు.

### జర్నలిస్టుల్లో అనర్హులను నియంత్రిస్తాం: మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి

జర్నలిస్టుల్లో అనర్హులను నియంత్రించేలా చర్యలు చేపడుతామని మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొన్ని మీడియా సంస్థలు అక్రిడేషన్ కార్డులకు రేటుకట్టి అమ్ముకుంటున్నాయని, వాటిని అరికట్టకపోతే భవిష్యత్తులో జర్నలిజం విలువలు మరింత దిగజారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని మనమే కట్టడి చేసుకుని నిజమైన జర్నలిస్టులను గుర్తించి వారికి అక్రిడేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు సరికొత్త గైడ్‌లైన్స్ రూపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

### లేఔట్ విషయంలో సహకరించాలి : ఎన్. వంశీ శ్రీనివాస్

ప్రభుత్వం నిజాంపేట, పేట్ బషీరాబాద్ స్థలాల్లో లేఔట్ చేసే విషయంలో సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సొసైటీ డైరెక్టర్ ఎన్. వంశీ శ్రీనివాస్ కోరారు. నిజాంపేట లో కేటాయించిన 32 ఎకరాల్లో ఉన్న రాతి గుట్టలను తొలగించేందుకు ప్రభుత్వమే చొరవ చూపాలని సూచించారు. జర్నలిస్టు కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పుడూ రుణ పడిఉంటాయని అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరువాత ప్రస్తుతం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్లు బి. కిరణ్‌కుమార్, ఆర్ రవికాంత్‌రెడ్డి, ఎన్. వంశీ శ్రీనివాస్, పి.వి రమణరావు, కె. అశోక్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అశువులు బాసిన జర్నలిస్టు మిత్రుల కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టు మిత్రులు తమ కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# హైడ్రా దూకుడు



హైదరాబాద్:(ప్రజా వినికిడి):
మాదాపూర్ లోని సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మిస్తున్నటువంటి నాలుగు అంతస్తులది ఒకటి, రెండు అంతస్తులది మరొకటి భవనాలను కూల్చివేసి, 30కిపైగా షెడ్ లను అధికారులు నేటమట్టం చేశారు. 10 ఎకరాల చెరువు భూమిని హైడ్రా తిరిగి స్వాధీనం చేసుకున్నది. అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలోని 51 ఎకరాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, రోడ్లను సైతం ఆక్రమిస్తూ పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన అక్రమ లేవుట్‌కు సంబంధించిన ప్రహరీ గోడతో పాటు రెండు సెక్యూరిటీ గదులను అధికారులు తొలగించారు.
దుండిగల్ మల్లంపేట్ కత్వా చెరువు ఎఫ్ .టి.ఎల్ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్నటువంటి 11 డూప్లెక్స్ విల్లాలను అధికారులు తొలగించి 2 ఎకరాల చెరువు భూమిని హైడ్రా స్వాధీనం చేసుకున్నది. పలువురు అడ్డుకునే ప్రయత్నాలు చేసినా హైడ్రా ఎవరి అభ్యంతరాలను పట్టించుకోకుండా హైడ్రా కూల్చివేతలను కొనసాగించింది. మల్లంపేట్ చెరువు వద్ద విల్లాల్లోని ఇంటి సామాగ్రిని బయటపెట్టగా.. కమిషనర్ రంగనాథ్ వెంటనే స్పందించి.. ఇండ్లలోని వస్తువులను మరల ఇంటిలోపిలికే తరలించారు. నివాసమున్న ఇండ్లను కూల్చివేయమని చెప్పడం అధికారులు వెల్లడించారు.
సున్నం చెరువు, పెద్ద చెరువు, మల్లంపేట కత్వా ప్రాంతాల్లోని కూల్చివేసివి నిర్మాణ దశలోనే ఉన్నాయి. మల్లంపేట్ కత్వా వద్ద విలాలను నిర్మించిన శ్రీలక్ష్మీ నివాస్ సంస్థ చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేసింది. అమీన్‌పూర్‌లో కూల్చివేసిన నిర్మాణాలు ప్రధానంగా కాంపౌండ్ గోడలు, గదులు, షెడ్‌ల రూపంలోని ఆక్రమణలే ఉన్నాయి. ఏపీకి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడికి చెందిన నిర్మాణాలుగా హైడ్రా అధికారులు గుర్తించారు. సున్నం చెరువు ఎఫ్‌టిఎల్‌లో నిర్మించిన కొన్ని షెడ్లు నిర్మించి హోటల్‌ను వాణిజ్యపరంగా వినియోగిస్తున్నందున కూల్చివేసినట్టు అధికారులు వెల్లడించారు. సున్నం చెరువు ప్రాంతాల్లో గోపాల్ అనే వ్యక్తిఅక్రమ నిర్మాణాలు చేపట్టారనీ, అమీన్ పూర్‌లో విజయలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే కాటసాని భూపల్ రెడ్డిలు కలిసి నిర్మాణాలను ,చేపట్టిన్నట్ట అధికార వర్గాలు వెల్లడించాయి.

### నేనే కూల్చివేస్తా : మురళీమోహన్

జయభేరి కన్‌స్ట్రక్షన్ సంస్థ గచ్చిబౌలిలోని రంగలాల్ కుంట చెరువును ఆక్రమించుకున్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో కమిషనర్ రంగనాథ్ ఆ చెరువును పరిశీలించారు. అనంతరం ఎఫ్‌టిఎల్ పరిధిలోకి కొంత మేర మెష్ వచ్చినట్టు నిర్మాణ సంస్థకు తెలియజేసి దానిని తొలగించాలని సూచించారు. అనంతరం మెష్‌ను తొలగించేందుకు వారం రోజులు గడువునిచ్చింది హైడ్రా. దీంతో మురళీమోహన్ స్పందిస్తూ.. తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని స్పష్టంచేశారు. ‘ నేను ఆక్రమణలకు పాల్పడలేదు. 33 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను.
ఏనాడూ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తాను. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా ఆధికారులు వచ్చారు. బఫర్ జోన్‌లో మూడు అడుగుల మేరకు.. రేకుల షెడ్డు ఉన్నట్టు అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఆ రేకుల షెడ్డును మేమే తొలగించేస్తాం.. హైడ్రా రానక్కర్లేదు. రెండ్రోజుల్లో (మంగళవారం లోపు) తాత్కాలిక షెడ్డును తొలగిస్తాం’ అని మురళీ మోహన్ స్పష్టం చేశారు. దీంతో మురళీ మోహన్‌పై జరుగుతున్న ప్రచారానికి ఆయన చెక్ పెట్టారు.

# బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు మహిళా కాంగ్రెస్ నాయకురాలు శుభాకాంక్షలు





ప్రజావినికిడి,(ఖైరతాబాద్):
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు మరియు ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, మహిళా కాంగ్రెస్ కమిటీ తోపాటుకలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# నివాసిత భవనాల జోలికి వెళ్లం: రంగనాథ్

**(మొదటి పేజీ తరువాయి)**వ్యక్తిగత ఇండ్లు అలాగే స్థలాలు కొనుగోలు చేసే ముందు అవి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయా? లేదా? అని ముందుగా ప్ర జలు నిర్ధారించుకొవాలని హైడ్రా కమిషనర్ ప్ర జలకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ని చెరువులకు సంబంధించిన ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల వివరాలను తెలుసుకునేందుకు హెచ్ఎండిఏ వెబ్‌సైట్‌లోని లేక్ ప్రొటెక్షన్ కమిటీలో తెలుసుకోవచ్చని, లేదా హైడ్రా కార్యాలయానికి వచ్చి వివరాలను తెలుసుకోవడం, సందేహాలను నివృ త్తి చేసుకోవచ్చని, ఏదేని కొనుగోలు చేసుకునేముందు పూర్తి వివరాలను తెలుసుకున్న అనంతరమే కొనుగోలు చేయాలా? వద్దా? అనేది నిర్ధారించుకుని భవనం, ప్లాటు, ఫ్లాట్స్ కొనుగోలు చేయాలని కమిషనర్ రంగనాథ్ సూచించారు.చెరువుల్లో వెలిసిన నిర్మాణదశలో ఉన్న ఆక్రమణలను మాత్రమే కూల్చివేస్తున్నామన్న హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ప్రకటన సర్వ త్రా ఆసక్తికరమైన చర్చనీయాంశంగా మారింది. నగరంలోని పలు చెరువుల్లో కొందరు ప్రజాప్రతినిధులకు చెందిన విద్యాసంస్థల భవనాలు ఉన్నాయనేది తెలిసిందే. అయితే, వాటిలో గత కొన్నేళ్లుగా విద్యాసంస్థలు నడుస్తున్నాయి. ఈ ఆక్రమణలను కూల్చివేయాలని హైడ్రాకు ఇప్పటికే అనేక ఫిర్యాదులు అం దాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ దశలో ఉన్నవాటినే కూల్చేస్తామని ప్రకటించడంతో వాటికి వెసులుబాటు కల్పించినట్టుగా విమర్శలు వ స్తున్నాయి.

## తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు..

# 5 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్:(ప్రజా వినికిడి):
రాష్ట్రాన్ని వర్షాలు వదలటంలేదు. ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరునుంచి భారీ వర్షాలు కురిశాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను మళ్లీ తడిపేశాయి. ఉదయం నుంచి మేఘావృతంగా ఉన్న ఆకాశాం ఒక్కసారిగా కుండపోత వర్షం కుమ్మరించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో రొడ్లు జలమయంగా మారాయి. బంజారాహిల్స్, అమీర్‌పేట్, సనత్‌నగర్, మియాపూర్, చందానగర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం జగద్గిరిగుట్ట ,జీడిమెట్ల, ముషీరాబాద్, దిల్‌సుఖ్ నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలోని కొల్లూరులో 115.2మి.మి వర్షం కురిసింది. మహబూబాదాద్‌లో 114.7, బయ్యారంలో 105జ7, అల్లూడ్‌లో 103, వైరాలో 90.9, గార్లలో 87, నేలకొండూరులో 87, డోర్నకల్‌లో 76 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కుసిరింది.అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# మళ్లీ పొంగిన మున్నేరువాగు

**(మొదటి పేజీ తరువాయి)**
వందేళ్ళ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈనెల 1న వచ్చిన భారీ వరదలతో సర్వం కోల్పోయి బురదమమైన ఇళ్ళను శుభ్రం చేసుకొని ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్న సమయంలో మళ్ళీ వరదలు రావడంతో బాధిత కుటుంబాలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. మున్నేరు క్యాచ్ మెంట్ ఏరియాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు కుండపోతగా వర్షం కురుస్తోంది. దీంతో ఖమ్మం నగరంలో మున్నేరు వద్ద వరద ఉధృతి తీవ్రమైంది.శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 14 అడుగులకు వరద చేరుకుంది. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతూ ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు 15.20 అడుగులు, ఉదయం 7 గంటలకు 15.75 అడుగులకు చేరుకుంది. 16 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు. 16 అడుగులకు చేరువలో ఉండటంతో అర్ధరాత్రి నుంచే అధికారులు మున్నేరు పరివాహక ప్రాంతంలో నివాసితులందరినీ ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ విషయం తెలిసి డిప్యూటీ సిఎం హుటాహుటిన హైదరాబాద్ నుంచి ఖమ్మం నగరానికి వచ్చి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితుల పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా హుటాహుటిన ఖమ్మం నగరానికి చేరుకొని అధికారులను అ ప్రమత్తం చేశారు. ఆదివారం ఉదయం ఏడున్న ర గంటల తరువాత మున్నేరు కొంత శాంతించడం ప్రారంభించడంతో అధికార యంత్రాంగం కాస్తా ఊపిరి పీల్చుకుంది. ఉదయం ఏడున్నర గంటల నుంచి గంట గంటకు తగ్గుతూ రాత్రి 8 గంటలకు 13.10 అడుగులకు చేరుకుంది. మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలను మైకులో అనౌన్స్‌మెంట్ చేయించి సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈనెల 1వ తేదీన ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్ మండలంలో దాదాపు 7 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించగా ఆదివారం 8270 మందిని అయిదు పునరావాస కేం ద్రాలకు తరలించారు.

# సైదాబాద్ లో త్రిముఖి గణేష్ గా దర్శనం..

## విశేష పూజలు అందుకున్న విఘ్నరాజా..





ప్రజావినికిడి,(సైదాబాద్):ప్రత్యేక ఆకర్షణగా హైదరాబాద్ లోని సైదాబాద్ శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి రోజున విఘ్నేశ్వరునికి విశేష పూజలు చేసిఅసోసియేషన్ సభ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఈసారి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి అటు రైతులు చాలా సంతోషంగా ఉన్నారని గణనాధుని ఆశీర్వాదం వల్లే ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాముఅలాగే ఏ పని మొదలు పెట్టిన మొదట వినాయక పూజతో మొదలు చేస్తారని ఆ పూజ తోనే ఏ పని చేపట్టిన విజయం సాధిస్తామని అందుకని మొదటి పూజ వినాయకునికి చేస్తామని పూజా కార్యక్రమం సందర్భంగా యూత్ సభ్యులు అన్నారు.ఈ పూజా కార్యక్రమం లో యూత్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# కొత్తపేట్ డిసిఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



ప్రజావినికిడి,(కొత్తపేట): డిసిఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత 11 ఏళ్ల నుండి ఇక్కడ వినాయకుడిని ప్రతిష్టించి ఎంతో ఘనంగా పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఆ వినాయకుడి దయవల్ల ప్రజలందరూ బాగుండాలని కోరారు.5వ రోజు నిమజ్జన కార్యక్రమం ఉంటుందని అన్నారు.ఇందులో భాగంగా అన్నదాన కార్యక్రమం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదయ్య, వెంకటేష్,లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్,కృష్ణగౌడ్,ఎల్లేష్, ఐలేష్,తదితరులు పాల్గొన్నారు.

# సమతాపురి కాలనీలోని చిన్న జీయర్ రెసిడెన్సి లో ఘనంగా వినాయక చవితి వేడుకలు





ప్రజావినికిడి,(కొత్తపేట): డివిజన్ పరిధి సమతపురి కాలనీ లోని చిన్న జీయర్ రెసిడెన్సి లో వినాయక చవితి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,గత 6 ఏళ్ల నుండి ఇక్కడ ఘనంగా వినాయక చవితి వేడుకలు జరుపుతున్నామని అన్నారు.హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో ఎక్కడా లేని విధంగా అలంకరణ, పూజలు మా దగ్గర జరుపుతామని తెలిపారు.ప్రతి సంవత్సరం వినాయకుని తీసుకొచ్చి ఆ తర్వాత అలంకరణ మేమే చేస్తామని అన్నారు.ఒక్క వినాయక చవితే కాకుండా కాలనీవాసుల ఐక్యమత్యంతో ప్రతి పండుగను కూడా ఎంతో కనుల పండుగగా నిర్వహిస్తామన్నారు.ఇక్కడ ప్రతిష్టించిన వినాయకుడికి ఎంతో మహిమ ఉంటుందని, ఎలాంటి కోరికలైన నెరవేరుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శృంగేరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



ప్రజావినికిడి,(కొత్తపేట): కొత్తపేటపరధి లోని,శృంగేరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,గత 15 ఏళ్ల నుండి ఇక్కడ ఎంతో ఘనంగా వినాయకుడిని ప్రతిష్టిస్తున్నామని తెలిపారు. ఆ వినాయకుడి దయవల్ల ప్రజలందరూ బాగుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సుబ్బారావు, జనరల్ సెక్రెటరీ నిరంజన్,ట్రెజరర్ బాలకృష్ణ,ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి,మాణిక్ రావు,కన్నయ్య, కాలనీవాసులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గాయత్రి పురంలోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు..



ప్రజావినికిడి,(కొత్తపేట):కొత్తపేట డివిజన్ పరిధి గాయత్రి పురం లోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి రెండో రోజు ఎంతో ఘనమైన పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ,గత 4 ఏళు ్లగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాగే ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు.గతంలో వేరే ప్రదేశంలో తమ వినాయకుడు ఉండేదని ఒక సంవత్సరం నుండి ఇక్కడ నెలకొల్పి ఘనమైన పూజలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా ఆటలు, తాంబూలా ఆటలు నిర్వహించుకుంటామని అన్నారు.ఆ భగవంతుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆరవ రోజు సెప్టెంబర్ 12వ తేదీన అన్నదాన కార్యక్రమం ఉంటుందని, శోభాయాత్ర 15వ తేదీన ఉంటుందని కావున భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రణీత్, ప్రణవ్, రిషి,సాండి, సుమిత్,హర్షిత్,సాయి చరణ్,నితిన్, యాష్,సుమిత్, అనిత్,విష్ణు,ప్రభత్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వద్దు.. గ్రామపంచాయతీ ముద్దు..

**ఘన్సిమియాగూడ గ్రామాపంచాయతీగా కొనసాగించాలి.**

**ఘన్సిమియాగూడ కార్యదర్శి గ్రామసభ నిర్వహించకుండా తప్పుడు తీర్మానం..**

**తీర్మాన పత్రంలో ఆశ వర్కర్స్ &అంగన్వాడీ టీచర్ హాజర్ అయినట్లు బోగస్ పత్రాన్ని సృష్టించిన కార్యదర్శి...**

**ప్రజలు ఆదాయం పెరగకుండానే ఆదనపు భారాలు మోయాలి..**

**ఘన్సిమియాగూడ గ్రామానికి తీరని అన్యాయం..జిల్లా ఆనంద్..**



ప్రజావినికిడి, (శంషాబాద్):సెప్టెంబర్ 8, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల ఘన్సిమియాగూడ గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్థులు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఆనంద్ మాట్లాడుతూ, మున్సిపల్ వద్దు గ్రామపంచాయతీ ముద్దు అన్నారు. ఘన్సిమియాగూడ గ్రామపంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి గ్రామసభ నిర్వహించకుండ తప్పుడు తీర్మానాన్ని పైఆధికారులకు ఇవ్వడం సరైన పద్ధతి కాదు అని అన్నారు. తీర్మాన పత్రంలో ఆశ వర్కర్స్ అలాగే అంగన్వాడీ టీచర్ హాజరు అయినట్లు బోగస్ పత్రాన్ని సృష్టించి గ్రామపంచాయతీకీ తీరని అన్యాయం చేశారు అన్నారు. స్థానిక ప్రజలకు ఆదాయం పెద్దగా ఏమి లేదన్నారు.రోజు కూలీ-నాలి వ్యవసాయం చేసుకొని బతుకుతున్నారు. గ్రామంలో సన్న కారు జీవితాలను మున్సిపల్ లో విలీనం చేస్తే ఇబ్బందులు వస్తాయని అన్నారు. మున్సిపల్ లో ఘన్సీమీయగూడ గ్రామాన్ని కలిపితె గ్రామ ప్రజలు ఆదాయం పెరగకుండానే ఆదనపు భారాలు మోయాల్సి వస్తోందని అన్నారు. పరిపాలన భారం పెరుగుతుంది,కానీ ప్రజలకు స్థానిక సమస్యలు పరిష్కరించు కోవడానికి గ్రామ పంచాయతీ ముఖ్యమని అన్నారు. ఇప్పటి వరకు గ్రామం అభివృద్ధికి నోచుకోలేక పోయింది.కాబట్టి పై అధికారులు ఇట్టి విషయంపై ఆలోచించి ఈ కార్యాపాలకు పాల్పడేటువంటి వారిపై కఠిన చర్యలు



తీసుకోవాలని మా ఘన్సిమియాగూడ గ్రామాన్ని గ్రామపంచాయతీ కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రవీందర్,జంగయ్య, అంగన్వాడీ టీచర్ ప్రభావతి,ఆశ వర్కర్స్ అనిత,రజియా,కిట్టు, రాజు,నందు,బాబు, శ్రీనివాస్,సిద్దయా ఇమ్రాన్,శ్రీకాంత్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

**ఎస్ ఎస్ సి లో ఇంటర్మీడియట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అవార్డు అందజేత..**



ప్రజావినికిడి,(షాద్ నగర్): ఆదివారం రోజు మున్నూరు కాపు సంఘం షాద్ నగర్ తాలూకా వారి ఆధ్వర్యంలో మేడిగా పెంటయ్య అధ్యక్షతన స్థానిక మా కన్వెన్షన్ హాల్ లో మున్నూరు కాపు సంఘ ఉత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినవారోత్సవాల సందర్భంగా పదిమంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగిందిఅలాగే ఈ సంవత్సరం ఎస్-ఎస్ సి లో అలాగే ఇంటర్మీడియట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కాచిగూడ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ వారు అందించిన మెరిట్ అలాగే ప్రతిభ పురస్కారాల అవార్డులను అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంచిరేవుల సాయి కృష్ణ అలాగే ప్రధాన కార్యదర్శి గండు నారాయణ గారు సంఘ కోశాధికారి మురళీమల్చలం అలాగే రిటైర్డ్ ఎంఈఓ ఆకుల విద్యాసాగర్ రిటైర్డ్ హెడ్ మాస్టర్ గంధం చెన్నయ్య గురుకుల వైస్ ప్రిన్సిపల్ సరితా మేడం అలాగే ఈ సంవత్సరం 2024 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు గంధం మాధవి జాకారం శేఖర్ ఆకులరవి ఆకుల శ్రీను ఆవుల ఆంజనేయులు గంధం శ్రీనివాస్ మేడిగ శ్రీనివాస్ పడకండి శ్రీశైలం కేహెచ్ భూషణ్ మేడిగా దామోదర్ హాల్ యజమాని మల్చలం బిక్షపతి ఆకుల సంపత్,విద్యార్థిని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భీమారం ఆనకట్టను పునరుద్ధరించాలి..

## షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..

**భీమారం ఆనకట్టను పరిశీలించిన స్థానిక టిడిపి బృందం..**

**నీటి తీరువాలను సంరక్షించి భూగర్భ జల సమృద్ధికి పాటుపడాలి..**

ప్రజావినికిడి,(షాద్ నగర్): నిజాం కాలంలో నిర్మించిన నీటి వనరులను కాపాడి భూగర్భ జలాల తోడ్పాటుకు దోహదపడాల్సిన అవసరం ప్రభుత్వం పైన ఎంతైనా ఉందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,తెలుగుదేశం పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు. ఫరూక్ నగర్ మండలంలోని భీమారం ఆనకట్టను ఆదివారం సాయంత్రం స్థానిక మాజీ ఎమ్మెల్యే టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు తదితర టిడిపి స్థానిక నేతల బృందంతో కలిసి పరిశీలించారు.

నిజాం కాలంలో నిర్మించిన భీమారం ఆనకట్టకు పురాతన చారిత్రాత్మక విశేషం ఉందన్నారు. కొందుర్గు ఎగువ ప్రాంతాల నుండి వచ్చే భారీ వరద నీరు చించోడు వాగు ద్వారా ఆనకట్టకు చేరుకుంటుందని తెలిపారు.ఇక్కడి నుండి సూరారం పాటు కాలువ ద్వారా బాలానగర్ మండలంలో దాదాపు 300 ఎకరాల ఆయకట్టుగా రైతులు వ్యవసాయాన్ని పండిస్తారని తెలిపారు. ఈ నీరు డిండి ప్రాజెక్టుకు కూడా చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భీమారం ఆనకట్టకు ఉన్న గేట్లను కొందరు ఎత్తుకెళ్లారని ఫలితంగా నీరు నిలవకుండా వెళ్ళిపోతుందని ఆందోళన వ్యక్తం





చేశారు.ఎంతో పటిష్టమైన చించోడు ఆనకట్ట వాడుకలోకి వస్తే ఇక్కడి రైతాంగానికి వ్యవసాయానికి ఎంతో చేదోడు వాదోడుగా ఉంటుందని అన్నారు. నీటి వనరులు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. ఆనకట్టను పునరుద్ధరిస్తే భూగర్భ జలాలకు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు.నీరు వృధా పోకుండా ఇక్కడే నిల్వ చేసి ఉంటే ఇక్కడ వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి వ్యవసాయానికి లాభసాటిగా ఉంటుందని అన్నారు. ప్రజలకు ఉపయోగకరమైన పనులను గత పాలకులు ఎంతో దూర దృష్టితో ఆలోచించి వీటిని నిర్మించారని, వాటిని కూడా కాపాడుకోకపోతే భావితరాలకు ఏం మిగులుతుందని? ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చరిత్ర గల ఇలాంటి ఆనకట్టలను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రభుత్వం పైన కూడా ఎంతో ఉందని అన్నారు. భీమారం ఆనకట్టను మరమ్మత్తులు చేసి ఉపయోగంలోకి తెస్తే ఇక్కడి వ్యవసాయానికి లాభ సాటిగా ఉంటుందన్నారు. భీమారం ఆనకట్టను సందర్శించిన వారిలో టిడిపి బృందం నాయకులు కుమార్ గౌడ్,భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర రెడ్డి, నాగులపల్లి అంతయ్య,మద్దూరి రాజు,రైతు బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613




# ఓవర్సీస్ ప్రీసేల్‌లో దుమ్మురేపుతున్న 'దేవర'

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' . జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గరపడటంతో ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుక్ స్టార్ట్ చేశారు మేకర్స్. అయితే అటు అడ్వాన్స్ బుక్ స్టార్ట్ చేశారో లేదో ప్రీసేల్‌లో 5 లక్షల టికెట్లు బుక్ అయినట్లు టీమ్ ప్రకటించింది. ఇక అమెరికాతో పాటు కెనడాలో కూడా ఈ సినిమా సత్తా చాటుతున్నట్లు చిత్రబృందం తెలపింది. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న విడుదల చేయనున్నట్లు దేవర టీం ప్రకటించింది. ఈ ట్రైలర్ ఈవెంట్‌ను ముంబైలో భారీ ఎత్తున్న ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.




# తమ్ముడి కోసం అక్క పోరాటం..

## అలియా భట్ 'జిగ్రా' ట్రైలర్ రిలీజ్

రాఖీ కట్టి తన అక్కకు ఏ కష్టం వచ్చిన చూసుకుంటాను అంటారు సోదరులు. కానీ ఇక్కడ తన తమ్ముడికి కష్టం వస్తే.. అతనికి ఎలాంటి హానీ జరగకుండా కాపాడుకుంటానని అలియా భట్ ఒక అక్కగా ప్రమాణం చేస్తుంది. రాకీ ఔర్ రాణి కియా ప్రేమ్ కహానీ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అలియా భట్ నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రా' . 'ఆర్చీస్' చిత్రంలో కీలక పాత్ర పోషించినవేదాంగ్ రైనా అలియా భట్ తమ్ముడిగా నటిస్తుండగా.. టాలీవుడ్ నటుడు రాహుల్ రవీంద్రన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమాకు మౌనిక ఓ మై డార్లింగ్ సినిమా ఫేం వసన్ బాల దర్శకత్వం వహిస్తుండగా.. ధర్మ ప్రోడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అలియా భట్, షాహీన్ భట్ సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని దసరా కానుకగా అక్టోబర్ 11న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ చూస్తే.. ఆపదలో ఉన్నతమ్ముడిని రక్షించుకోవడానికి ఒక అక్క చేసే పోరాటమే ఈ సినిమా అని తెలుస్తుంది. ఇక అలియా భట్ చాలా రోజుల తర్వాత కొత్త లుక్‌లో కనిపించింది.



# ఓటీటీలోకి రాబోతున్న 'ఆయ్'..

## -స్ట్రీమింగ్ ఎప్పుడంటే.?

గీతా ఆర్ట్స్2 పిక్చర్స్ బ్యానర్ పై బన్నీ వాసు నిర్మాణంలో తెరకెక్కిన తాజా చిత్రం ఆయ్ . ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అంజి కంచిపల్లి దర్శకత్వం వహించాడు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా.. రూ.15 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా సెప్టెంబర్ 12 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు కార్తీక్ (నార్నె నితిన్). కరోనా వలన లాక్ డౌన్ రావడంతో తన సోంతఊరు అయిన అమలాపురం వస్తాడు. అయితే అమలాపురంలో వర్క్ ఫ్రం హోమ్ చేసుకుంటునే తన చిన్ననాటి ఫ్రెండ్స్ అయిన హరి(అంకిత్ కోయ), సుబ్బు(రాజ్ కుమార్ కసిరెడ్డి)తో కలిసి సరదాగా గడుపుతుంటాడు. అయితే అదే ఊరిలో ఉన్న పల్లవి (నయన్ సారిక)ని చూసి ఫస్ట్ లుక్‌లోనే ఇష్టం పెంచుకుంటాడు. అయితే ఊరులో ఉండే పల్లవికి సోషల్ మీడియాలో చలాకీగా ఉండడంతో పాటు కులం పట్టింపులు ఎక్కువ. అయితే కార్తీక్ తన కులం వాడే అనుకుని లవ్ చేస్తుంది. అయితే కార్తీక్ కులం వేరని తెలిసిన పల్లవి తన తండ్రి (మైమ్ గోపి) అతడిని చంపేస్తాడని దూరం పెడుతుంది. ఈ క్రమంలో కార్తీక్ ఏం చేస్తాడు. పల్లవి, కార్తీక్‌ల ప్రేమను పల్లవి తండ్రి ఒప్పుకుంటాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# అప్పట్లోనే హృదయం ముక్కలైంది..

## -రిలేషన్‌షిప్‌పై తమన్నా స్పందన

మిల్కీబ్యూటీ తమన్నా రిలేషన్‌షిప్ గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. తాను కూడా కొన్ని చేదు అనుభవాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. టీనేజ్‌లోనే తొలిసారి ప్రేమలో పడ్డానని.. కొన్ని కారణాలతో అది వర్కౌట్ కాలేదని, తన జీవితంలో రెండు బ్రేకప్స్ ఉన్నాయని వెల్లడించారు. "ఇప్పటివరకూ రెండుసార్లు నా హృదయం ముక్కలైంది. ఆ సమయంలో నాకెంతో బాధగా అనిపించింది. టీనేజ్‌లో ఉన్నప్పుడే తొలి హార్ట్‌బ్రేక్ ఎదుర్కొన్నాను. ఒక వ్యక్తి కోసం నచ్చిన జీవితాన్ని వదులుకోవడం నాకు నచ్చలేదు. జీవితంలో ఏదో సాధించాలని కొత్త విషయాల గురించి అన్వేషించాలనేది నా భావన. ఆ కారణంతోనే ఆ బంధం నిలబడలేదు. ఆ తర్వాత మరో వ్యక్తితో కొంతకాలం రిలేషన్‌లో ఉన్నా. అయితే.. అతడు నాకు సెట్ కాడనిపించింది. ప్రతి చిన్న విషయానికీ అబద్ధం చెప్పేవాళ్లంటే నాకు ఇష్టం ఉండదు. అలాంటి వ్యక్తితో బంధాన్ని కొనసాగిస్తే పమాదం అని అర్థమైంది. అలా అది కూడా ముగిసిపోయింది" అని తమన్నా తెలిపారు. ప్రస్తుతం తమన్నా విజయ్ వర్మతో ప్రేమలో ఉంది. లస్ట్ స్టోరీస్ 2 సిరీస్‌లో వీరిద్దరూ కలిసి నటించారు. అప్పుడే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. త్వరలో ఈ జంట పెళ్లి పీటలెక్కే అవకాశం ఉంది. విజయ్ తనకు పర్ఫెక్ట్ మ్యాచ్ అని తమన్నా విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం ఆమె దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ వరుస సినిమాలు చేస్తున్నారు. 'స్త్రీ 2'లో స్పెషల్ సాంగ్ చేశారు. ఆమె కీలక పాత్రలో నటిస్తున్న 'ఓదెల 2' చిత్రీకరణ దశలో ఉంది.





# లెహంగాలో అందంగా

# మెరిసిన సారా అలీ ఖాన్..

సారా అలీ ఖాన్.. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతున్న కుర్ర హీరోయిన్లలో ఒకరు. స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ కూతురిగా సినీరంగంలోకి అడుగుపెట్టిన సారా.. మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తాజాగా తన ఇన్ స్టాలో సారా షేర్ చేసిన ఫోటోస్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పర్పుల్ కలర్ లెహంగాలోనే ఎంతో అందంగా కనిపిస్తుంది సారా. ప్రస్తుతం ఈ పిక్స్ చూసి ఫిదా అవుతున్నారు నెటిజన్స్. పటౌడీ ప్రిన్సెస్ అంటే ఆమాత్రం ఉండాల్సిందే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా అంబానీ ఇంట్లో జరిగిన గణేష్ చతుర్థి వేడుకలలో సారా పాల్గొంది. పర్పుల్ కలర్ లెహంగాలో అందంగా తయారై కనిపించింది. వినాయక చవితి వేడుకలకు ముందు తన సోదరుడు ఇబ్రహీం అలీతో కలిసి ఫోటోలకు ఫోజులిచ్చింది. కోలీవుడ్ హీరో ధనుష్ నటించిన అత్రంగి రే సినిమాతో ఇటు సౌత్ ఇండస్ట్రీలోనూ సారాకు మంచి ఫాలోయింగ్ ఉంది. ప్రస్తుతం హిందీలో బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో నటిస్తున్న సారా.. తెలుగులో అవకాశం వస్తే నటించేందుకు రెడీగా ఉన్నట్లు సమాచారం

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613